కలెక్టర్ కాసులిచ్చినా..
వరమివ్వని వరుణుడు!

- తూటేరు పూడిక తీతకు వర్షం అడ్డంకి
- గట్లపై బురదతో జారిపోతున్న జేసీబీలు
- వేసవిలో చేయకపోవడం వల్లే ఈ పాట్లు అని అన్నదాత ఆగ్రహం


బురదమయంగా ఉన్న తూటేరు డ్రైన్ గట్టు


గుర్రపు డెక్క, తూటికాడతో నిండి ఉన్న తూటేరు డ్రైను

సామర్లకోట: నిధులు మంజూరైనా నీటి ముంపు సమస్యపై వీకే రాయపురం రైతులు ఆందోళన చెందుతూనే ఉన్నారు. తూటేరు డ్రైను పూడిక తొలగింపునకు స్వయంగా కలెక్టర్ కృతికా శుక్లా రూ.1.95 లక్షలు విడుదల చేసిన విషయం తెలిసిందే. రెండు పెద్ద జేసీబీలతో గడచిన మంగళవారం పనులు మొదలుపెట్టాలని ఎంపీడీఓ రైతులతో సమీక్షించి నిర్ణయించారు. కాగా ఆ రోజు నుంచి ఎడతెరిపి లేని వానలతో గట్లు బురదమయమై మెషీన్లు జారిపోయే పరిస్థితి ఎదురవుతోంది. వేసవి కాలంలోనే ఇరిగేషన్ అధికారులు స్పందించి ఉంటే నేడు ఈ పరిస్థితి ఉండేది కాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుర్రపు డెక్క తీశాకే సాగు..



తూటేరు డ్రైనులో గుర్రపు డెక్క, తూటికాడ తీసిన తరువాతే వెదజల్లు పద్ధతిలో సాగు ప్రారంభిస్తారు. కొందరు రైతులు ఇతర ప్రాంతాల్లో నారుమళ్లు వేసిన ఆకు మిగిలి ఉంటే దానిని కొనుగోలు చేసి నాట్లు వేసుకుంటున్నారు. వర్షాలకు గట్లు జారి పోతున్నాయి. గుర్రపు డెక్క తీత పనులకు అయ్యే ఖర్చు రైతు సంఘం భరించడానికి సిద్ధంగా ఉంది.

– కుర్రా శ్రీనివాసరావు, రైతు సంఘ అధ్యక్షుడు, వీకే రాయపురం

ఆందోళన వద్దు



వరిసాగు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు. ఆగస్టు మొదటి వారంలోపు వెదజల్లు పద్ధతిలో సాగు చేసుకున్నా సమయం సరిపోతుంది. తూటేరు డ్రైను గట్లు వెడల్పు ఎక్కువగా లేక పోవడంతో వర్షపు నీటికి మిషన్లు జారిపోయే ప్రమాదం ఉండటంతోనే పనులు ప్రారంభం కాలేదు. వర్షాలు తగ్గి, గట్లపై తడి ఆరిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి.

– ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం


తాటిపర్తిలో లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- నేతన్న నేస్తం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేత

పిఠాపురం: చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన నేతన్న నేస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతన్న నేస్తం పథకం ద్వారా 2019–20 ఆర్థిక సంవత్సరంలో 299 మందికి రూ.71.76 లక్షలు, 2020–21లో 343 మందికి రూ.82.32 లక్షలు, 2021–22లో 356 మందికి రూ.85.44 లక్షలు, 2022–23లో 370 మందికి రూ.88.80 లక్షలు, 2023–24లో 393 మందికి రూ.94.32 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఇప్పటివరకూ మొత్తం 436 మందికి రూ.4,22,64,000 అందజేసినట్లు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో తినడానికి తిండి లేక నేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చాక కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం నేతన్నకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. చేనేతకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నేత కార్మికులకు ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం నేతన్ననేస్తం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో చేనేత జౌళీ శాఖ ఏడీ పెద్దిరాజు, ఏడీఓ రాంబాబు, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, సర్పంచ్ బుల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణు, ఉప సర్పంచ్ దాసం వెంకటేష్, వైఎస్సార్ సీపీ నేతలు మొగలి బాబ్జి, అరిగెల రామయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో మఖ నక్షత్రపూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీప్రకాష్‌లో టీటీ పోటీలు

పెద్దాపురం: ఈ నెల 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఫ్యూచర్ టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ మెన్, ఉమెన్ అండర్–19, 17, 15, 13, 11 విభాగాల్లో టీటీ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ వి.భాస్కరరామ్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో సుమారు 350 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థి మట్టే దాతృత్వం

- రూ.3.5 లక్షలతో పాఠశాల అభివృద్ధి



అధునాతనంగా కనిపిస్తున్న వీర్రాజు హైస్కూల్ (అంతర చిత్రం) దాత, పూర్వ విద్యార్థి మట్టే శ్రీనివాస్

పెద్దాపురం: స్థానిక వీర్రాజు హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తరఫున రూ.3.5 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టి తన దాతృత్వాన్ని చాటుకున్నారు లలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్. 1975 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశంలో మరమ్మతులకు గురైన తన పాఠశాలకు పనులు చేపట్టేందుకు గాను సొంత నిధులు ఇచ్చి అందరి మన్ననలు పొందారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూతనిచ్చిన శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష


కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న దొరబాబు తదితరులు


సామర్లకోటలో దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దొరబాబు


పొన్నాడలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న నాయకులు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా అపరిష్కృత సమస్యల నివారణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష ఏర్పాటు చేసిన ప్రతి సచివాలయంలో అవసరమైన ధ్రువపత్రాలు అందజేస్తున్నట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక 11వ సచివాలయం సత్యనారాయణపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజల కోసం పని చేస్తున్న ఏకైక సీఎం జగన్‌ను జీవిత కాలం ముఖ్యమంత్రిగా ఉంచుకునేలా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రజలకు సేవలు చేయాలనే లక్ష్యంతో రాజకీయాలలోనికి వచ్చానని నన్ను ఆశీర్వదించాలని దొరబాబు కోరారు. ఆర్డీఓ సీతారామారావు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రదేవి, మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షులు మేకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో అర్హులందరికీ పథకాలు

కొత్తపల్లి: గ్రామాల్లోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు అన్నారు. మండలంలోని పొన్నాడ గ్రామ సచివాలయం–1 వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు జ్యోతుల బాబులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో పథకాలు వర్తించాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల ఇంటికే పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి రాణి, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం, చంద్రమాంపల్లిల్లో...

పెద్దాపురం: స్థానిక ముప్పన రామారావు కల్యాణ మండపం, అలాగే చంద్రమాంపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, సర్పంచ్ కురిమెళ్ల లోవరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో దవులూరితో పాటు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా పాల్గొని దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరావు, కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, విడదాసరి రాజా, తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఈఓ పీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి పద్మరాజు తదితరులు పాల్గొన్నారు

పవరలో జగనన్న సురక్ష

సామర్లకోట: మండలంలోని పవర గ్రామంలో మండల ప్రత్యేకాధికారి రామ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జగనన్న సురక్ష నిర్వహించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్ వీరంరెడ్డి సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన చంటి బాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నాగనబొయన రాజబాబు తదితరులు పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు.

క్లుప్తంగా

తగ్గింపు ధరలకు నిత్యావసర వస్తువులు


పిఠాపురంలో నిత్యావసరాలు విక్రయించే కౌంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

పిఠాపురం: జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ఆదేశాల మేరకు తగ్గింపు ధరలకే నిత్యావసర వస్తువులు విక్రయించేలా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు డీఎస్‌ఓ ఎంవీ ప్రసాద్ తెలిపారు. పిఠాపురంలో శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో బీపీటీ బియ్యం కిలో రూ.36, కందిపప్పు కిలో రూ.46కు అందిచనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎస్‌ఓ ప్రసన్నకుమారి, ఎంఎస్‌ఓ ఎస్‌కే ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు


పిఠాపురం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురం: మాదక ద్రవ్యాల నివారణలో భాగంగా పిఠాపురం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఆపరేషన్ అర్జున్ నిర్వహించారు. బీడీబీఎస్ ఏఎస్ఐ ఏవీవీఎస్ వర్మ ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు, డాగ్ స్క్వాడ్ ఫ్లాట్ ఫామ్‌లు, విశ్రాంతి గదుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించిన బ్యాగ్‌లు, లగేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240)లో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఏ విధమైన మాదకద్రవ్యాలు లేవని నిర్ధారించారు. రైల్వే స్టేషన్లలో జరిగే చోరీలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సామర్లకోట రైల్వే ఎస్సై కేజీపీ రెడ్డి, ఏఎస్సై వి.వరప్రసాద్, పిఠాపురం స్టేషన్ మాస్టర్లు పి.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై...

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ నుంచి గంజాయి రవాణా అవుతోందనే ఆరోపణల మేరకు శుక్రవారం రాత్రి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పి. సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లు తనిఖీ చేశారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండి తమకు తెలిసిన సమాచారం అందజేయాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు రామోహన్‌రావు, జీఆర్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్య పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలి


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సామర్లకోట: చదువుపై విద్యార్థులు ఆసక్తి చూపేలా బోధన ఉండాలని డాక్టర్ అమర్ అన్నారు. స్వవిద్య శిక్షణలో ఆయన ఉపాధ్యాయులకు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, ఫ్యాకల్టీలు తోటకూర సాయిరామకృష్ణ, సునీత, ప్రత్యూష పాల్గొన్నారు.

ముద్దాయికి శిక్ష.. బంగారు ఆభరణాల రికవరీ

సామర్లకోట: దొంగతనానికి పాల్పడిన ఓ ముద్దాయికి నాలుగు నెలల జైలు శిక్ష కాకినాడ స్పెషల్ మొబైల్ జీఎఫ్ఎం కోర్టు మెజిస్ట్రేట్ ఎం.ఉషాలక్ష్మి తీర్పు చెప్పారు. సీఐ కె.దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. స్థానిక బ్రౌన్‌పేటకు చెందిన దంగేటి లక్ష్మణరావు తన ఇంట్లో దొంగతనం జరిగిందని గత ఏడాది ఏప్రిల్ 25న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ ఆధ్వర్యాన ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. నిందితుడు రామకృష్ణ ఈ దొంగతనానికి పాల్పడినట్టు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి, రూ.3.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని, కోర్టుకు తరలించారు. కోర్టు విచారణలో అతడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్షవిధించారు. ఏపీపీ విజయ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఓటు నమోదుపై ఇంటింటా సర్వే

రౌతులపూడి: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బి.భీమారావు సూచించారు. మండలంలోని బలరామపురంలో శుక్రవారం ఓటు నమోదుపై ఇంటింటా సర్వే నిర్వహించారు. తహసీల్దార్, బీఎల్‌ఓలు ప్రజలకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు.

వలంటీర్లకు వందనం

సర్వేలు చేస్తూ.. పథకాలు ఇప్పిస్తూ..

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందజేయడంలో వలంటీరు నాగదేవి ఆమె పరిధిలోని గృహాల్లో ఎంతో పేరు తెచ్చుకున్నారు. 13వ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికేట్లను ఉచితంగా అందజేయడం జరుగతుందని వివరిస్తూ లబ్ధిదారులతో దరఖాస్తులు చేయిస్తూ ఎంతో సహాయకరంగా ఉంటున్నారు.


లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటూ సర్వే చేస్తున్న వలంటీర్ నాగదేవి

వివరించి అందజేస్తున్నారు..



ప్రభుత్వ పథకాలను వివరిస్తూ అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోవాలని మా వలంటీర్ నాగదేవి ఎంతో సహాయకరంగా ఉన్నారు. మా పిల్లలకు అమ్మ ఒడి పథకం, రైతు భరోసా పథకాలు వచ్చేందుకు ఎంతో కృషి చేశారు. ఇంట్లో మామయ్య గార్కి వైఎస్సార్ పింఛను వస్తుంది. గతంలో ఎన్నడూ ఇటువంటి పథకాలు ఇంటికి తీసుకొని ఇచ్చే ప్రభుత్వం చూడలేదు. వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది.

– బలే నాగలక్ష్మి, లబ్ధిదారు, సామర్లకోట

ఓటర్ల సర్వే పరిశీలన


సామర్లకోటలో బీఎల్ఓల సర్వేను పరిశీలించిన కమిషనర్ రామారావు

సామర్లకోట: మున్సిపాలిటీలో ప్రారంభమైన ఓటర్ల సర్వేను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం పరిశీలించారు. నెల రోజుల పాటు బీఎల్‌ఓల ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా చేరడానికి బీఎల్‌ఓలకు సహకరించాలన్నారు. మరణించిన వారి పేర్లను బీఎల్‌ఓలకు తెలియజేయాలని, గతంలో ఉన్న ఇంటి నుంచి మరో ఇంటికి వెళ్లిన వారి వివరాలు తెలియజేయడం ద్వారా అందుబాటులో ఉన్న పోలింగ్ బూత్‌లో వారికి ఓటు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఓటరు జాబితా పేరు తప్పులు, చిరునామా తప్పులు, ఫొటోలు మారిపోయిన ఘటనలకు సంబంధించి సవరణలు చేయడం జరుగుతుందన్నారు. కొన్ని ప్రాంతాలలో జనాభా కంటే ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఈ సర్వేకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లోను 1500 నుంచి 2000 లోపు మాత్రమే ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

యువతకు ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో జాబ్ మేళా

పిఠాపురం: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం జాబ్ మేళాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం వలంటీర్లు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందిగా లక్షలాది మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించిందన్నారు. గత 50 ఏళ్లలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రభుత్వమూ ఇవ్వని విధంగా నిరుద్యోగ యువతకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిందన్నారు. ఇంకా మిగిలి ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరగకుండా కంపెనీలే ఇక్కడకు వచ్చి ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ అవకాశాలను నిరుద్యోగులు వినియోగించుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ జాబ్‌మేళాలో 13 కంపెనీలు పాల్గొనగా 292 మంది అభ్యర్థులు హాజరైనట్టు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి దండెం హరిశేషు తెలిపారు. వారిలో 138 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు కె. యశోదకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి శ్యామ్ కిషోర్, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, నడిగట్ల చింతలరావు, వజ్రపు వీరేష్, పచ్చిమళ్ల అప్పలరాజు, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన మట్టిగుట్ట

సాక్షి ఇంపాక్ట్


సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఉన్న మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

సామర్లకోట: పెద్దాపురం రోడ్డులో రోడ్డుపై ఉన్న మట్టి గుట్టను శుక్రవారం తొలగించారు. సామర్లకోట–పెద్దాపురం రోడ్డులోని గణపతి నగరం వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మాణం పూర్తి అయినా మట్టి రోడ్డుపై వదలి వేయడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై సాక్షి దినపత్రిక లో ఇటీవల 'ప్రమాదకరంగా మట్టి గుట్ట' అనే శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. కాంట్రాక్టరుకు మట్టి తొలగించే విధంగా ఆదేశాలు ఇచ్చారు. అలాగే రోడ్డు మార్జిన్‌లో ఇసుక ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని స్థానికులు వాపోతున్నారు.

గోపాల్‌బాబా ఆశ్రమాన్ని దర్శించిన నెదర్లాండ్ భక్తుడు


గోపాల్‌బాబా ఆశ్రమంలో పూజలు చేస్తున్న నెదర్లాండ్ దేశస్తుడు కృష్ణ సరస్వతీ (జాన్)

పిఠాపురం: స్థానిక గోపాల్‌బాబా ఆశ్రమాన్ని నెదర్లాండ్ దేశస్తుడు కృష్ణ సరస్వతీ (జాన్) శుక్రవారం దర్శించుకున్నారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేసిన జాన్ స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను హిందు ధర్మం పట్ల ఆకర్షితుడినై తన పేరును కృష్ణ సరస్వతీగా మార్చుకున్నట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా భారతదేశంలోని అన్ని ప్రముఖ దేవాలయాలను దర్శించుకుంటున్నట్టు చెప్పారు. ప్రపంచానికి భగవద్గీతను అందించిన హిందూ ధర్మం చాలా గొప్పదన్నారు. పిఠాపురానికి చెందిన హనుమాన్ దళ్ సభ్యులు గణేష్ కన్నా, నేమాల వరహాలు, సుదర్శనం, మాధవమణి కంఠాచార్య, నంద కిషోర్, రాంభోపాల్, రాధాకృష్ణ తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు.

- మొక్కే కదా అని వదిలేస్తే..


సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడలో పెరిగిన రావి మొక్కలు

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి గోడలో మొక్కలు పెరిగి వంతెనకు చేటు తెస్తున్నాయి. వంతెన గోడల వెంబడి రావి మొక్కలు ఇటీవల విపరీతంగా పెరిగి పోతున్నాయి. మొక్కే కదా వదలేస్తే మాను పెరిగి గోడలకు బీటలు ఏర్పడి శిథిలమయ్యే ప్రమాదం ఉంది. బ్రిడ్జి దిగువ భాగం నుంచి పైకి కనిపించేలా రావి మొక్కలు పెరిగిపోతున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో శుక్రవారం సత్యనారాయణపురంలో నిర్వహించిన జనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఆర్డీఓ సీతారామారావు, మున్సిపల్ కమిషనర్లకు స్థానికులు ఈ సమస్యను వివరించారు. ఆర్అండ్‌బీ అధికారులు చేయాల్సిన పనిని మేమే చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. శానిటరీ కార్మికుల సహకారంతో బ్రిడ్జి గోడలలో ఉన్న మొక్కలు తొలగిస్తామని చెప్పారు.